క్లుప్తంగా

గణపవరం ఎంఈవోగా రాజేష్ నియామకం

గణపవరం: గణపవరం ఎంఈవో-1గా ఎన్.రాజేష్ పూర్తి అదనపు బాధ్యతలతో నియమితులయ్యారు. ఈమేరకు ఆర్జేడీ నాగమణి శనివారం నియామక ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం రాజేష్ పెంటపాడులోని సీపీబీఎస్ ఉన్నత పాఠశాల గ్రేడ్ 2 హెచ్ఎంగా, వీరవాసరం మండల ఇన్‌ఛార్జి ఎంఈవో-1గా పనిచేస్తున్నారు. గత నెలాఖరున గణపవరం ఎంఈవో -1గా పనిచేస్తున్న పుచ్చల శేషు పదవీ విమరణ చేయడంతో ఆ స్థానంలో పూర్తి అదనపు బాధ్యతలతో రాజేష్ నియమితులయ్యారు.

కార్నియాల సేకరణ


నేత్రదానం చేసిన సరస్వతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గతంలో నేత్రదానానికి ముందుకొచ్చిన నగరానికి చెందిన ఉడత సరస్వతి ఇటీవల మృతి చెందగా, ఆమె కార్నియాలను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ప్రతినిధులు సేకరించారని లయన్స్ క్లబ్ నాయకుడు మానేపల్లి రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్నియాల ద్వారా ఇరువురు అంధలకు చూపు వస్తుందని పేర్కొన్నారు. దాత కుటుంబ సభ్యులు, లయన్స్ క్లబ్ ప్రతినిధి రత్నకుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దంత సంరక్షణపై అవగాహన


మాట్లాడుతున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దంత సమస్యలపై చిన్నతనం నుంచే అవగాహన కలిగి ఉండాలని అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు విద్యార్థులకు సూచించారు. ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలపై శనివారం స్థానిక అమీనా పేటలో ఉన్న సురేష్ చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో విద్యార్థులకు సూర్యచంద్రరావు ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రం హాస్పిటల్ హెచ్‌ఓడీ డాక్టర్ కంచర్ల వంశీ ప్రసాద్ దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. దంత సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ నరేంద్ర, స్కూల్ హెచ్ఎం వి.స్రవంతి, పీఈటీ వర ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థం


సమావేశంలో పాల్గొన్న అతిథులు, అంగన్‌వాడీలు

ఏలూరు (టూటౌన్): బాల్యవివాహాలపై అవగాహన పెంపొందించుకోవాలని 28వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల అరుణ సురేష్ అన్నారు. స్థానిక పుష్పలీలా నగర్‌లోని శ్రీ రామలింగేశ్వర పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వక్తలు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం సూర్యప్రకాష్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, తల్లిదండ్రులు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు. ఏలూరు ప్రాజెక్టు పరిధిలోని తంగెళ్లమూడి ఎలిమెంటరీ పాఠశాల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో హెచ్ఎం ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు అహ్మద్ మృతికి సంతాపం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల రాయచోటి జిల్లా కొత్తపల్లి మండలంలో విద్యార్థులు కొట్టడం వల్ల మనస్థాపానికి గురై మరణించిన ఉపాధ్యాయుడు ఏజాష్ అహ్మద్ మరణానికి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రైవేటు టీచర్లు, లెక్చరర్స్ నల్ల రిబ్బన్లు ధరించి సంతాపం వ్యక్తం చేసినట్టు ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దిద్దే అంబేద్కర్ తెలిపారు. స్థానిక కేపీడీటీ పాఠశాలలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరగతి గదిలోనే విద్యార్థులు కొట్టడం వల్ల ఉపాధ్యాయుడు మరణించడం అంటే, పాఠశాలలో, కాలేజీల్లో పరిస్థితులు ఎలా ఉన్నాయో ఆలోచించాలని అన్నారు. కొందరు విద్యార్థులు ప్రవర్తన ఆందోళనకరంగా ఉంటోందని తెలిపారు.

హస్త కళల్లో రాణించాలి

చింతలపూడి : హస్త కళల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు హస్త కళ సేవా కేంద్రం విజయవాడ సహాయ డైరెక్టర్ అపర్ణ లక్ష్మి అన్నారు. స్థానిక వీకేఎం ఫంక్షన్ హాల్‌లో శనివారం హ్యాండీ క్రాఫ్ట్ డెవలప్మెంట్ కమిషనరేట్ సహకారంతో హస్త కళాకారులకు ఒక రోజు సెమినార్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన అపర్ణ లక్ష్మి మాట్లాడుతూ హస్త కళల్లో నైపుణ్యం పెంపొందించుకునేలా నిర్వహిస్తోన్న గురు శిష్య రెండు నెలల శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హస్తకళాకారులు రూపొందించిన వస్తువులను వివిధ ప్రాంతాల్లో ప్రదర్శించి ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా చేయడమే కేంద్రం ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. చింతలపూడిలో మహిళలకు హస్తకళలపై శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు.

దోమల ఉధృతి.. వ్యాధుల వ్యాప్తి

- గ్రామాల్లో విపరీతంగా పెరిగిన దోమలు
- కాయిల్స్, లిక్విడ్‌లకు లొంగని వైనం


కొప్పాకలో డ్రెయిన్ లేక రోడ్డు మీదకు వదిలేస్తున్న మురుగు నీరు


రక్తం పీల్చేస్తున్న దోమ (ఫైల్)

పెదవేగి : వాతావరణంలో మార్పులు, ఈ ఏడాది అధిక వర్షాలు కురవడం తదితర కారణాల వల్ల గ్రామాల్లో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. సాయంత్రం నాలుగు గంటలు దాటితే చాలు బయటకు వచ్చి ప్రజలపై వాటి ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. అక్కడ, ఇక్కడ అనే తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ, అన్ని ప్రాంతాల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. సాధారణంగా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండి, భూమి తడి బారి ఎక్కువ రోజులు తేమ కారణంగా ఎక్కడిక్కడ దోమలు వృద్ధి చెందేవి. మిగిలిన కాలాల్లో డ్రెయినేజీలు, మురుగు నీరు పారని ప్రాంతాల్లో దోమల సమస్య ఎక్కువగా ఉండేది. అయితే కొన్ని రోజులుగా అన్ని ప్రాంతాల్లో అన్ని సీజన్లో దోమలు బెడద ఎక్కువైందని గ్రామాల్లో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యతో అనేక మంది వివిధ రోగాల బారిన పడుతున్నారు. మలేరియా, బోద, డెంగీ, చికున్ గున్యా, మెదడు వాపు తదితర వ్యాధులు వ్యాప్తి గ్రామాల్లో అధికంగా ఉంది. పలు ప్రాంతాల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా, మురుగు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. గ్రామ పంచాయతీల ద్వారా డ్రెయిన్లు, స్లమ్ ఏరియాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయకపోవడం కూడా వీటి వృద్ధికి కారణమని పలువురు తెలిపారు. గ్రామాల్లో దోమల నివారణకు గతంలో పంచాయతీలకు ఫాగింగ్ మెషీన్లు సరఫరా చేశారు. కానీ వాటిని ఉపయోగిస్తున్నట్లు ఎక్కడా కనిపించలేదు. దానిపై ఆరా తీస్తే పంచాయతీల్లో తగినంత పారిశుద్ధ్య సిబ్బంది లేక మందు పిచికారీ చేయడం లేదని, ఫాగింగ్ మెషీన్లు వినియోగించడం లేదని తెలుస్తోంది. ఇంతకు ముందెన్నడూ లేని విధంగా దోమ కుట్టిన వెంటనే చర్మంపై మంట, దద్దుర్లు వస్తున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమ కుట్టిన చోట చర్మం మంట పుట్టి, దద్దుర్లు వస్తున్నాయని అంటున్నారు. దోమల నివారణకు అధిక నిధులు వెచ్చించి మస్కిటో కాయిల్స్ వెలిగిస్తున్నా, లిక్విడ్ మెషీన్లు పెడుతున్నా వాటి బారినుంచి తప్పించుకోలేకపోతున్నామని అనేమంది వాపోతున్నారు.

పంచాయతీలు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

ప్రస్తుతం విపరీతంగా పెరిగిపోయిన దోమల నివారణకు ప్రభుత్వం గ్రామ పంచాయతీల ద్వారా ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ప్రధానంగా డ్రైన్లతోపాటు, కచ్చా డ్రెయిన్లు ఉన్న ప్రాంతాల్లో ఎబేట్ మందు పిచికారీ కార్యక్రమాన్ని తరచూ విస్తృతంగా చేపట్టి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– తనగాల శేఖర్, నాగన్నగూడెం గ్రామస్తుడు

జ్వరం వస్తే వైద్యులను సంప్రదించాలి

దోమే కదా కుట్టిందని ఊరుకుంటే ఒక్కోసారి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. పలు రకాల దోమలు కుట్టడం వల్ల తొలుత జ్వరం వస్తుంది. నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. అవసరమైతే పరీక్షలు చేయించుకుని తగిన వైద్యం పొందాలి.

– పి. పూర్ణిమ, ప్రాథమిక వైద్యశాల వైద్యుడు, పెదవేగి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీమడోలు: భీమడోలు సెక్షన్ 220, 132, 33 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలోని కండక్టర్ల మార్పు నేపథ్యంలో ఈనెల 8న ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏలూరు ఆపరేషన్లు ఈఈ కేఎం అంబేడ్కర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భీమడోలు సెక్షన్ పరిధిలోని సూరప్పగూడెం, పోలసానిపల్లి, పాతూరు, భీమడోలు, దిగుడుపాటి దిబ్బ గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆయన తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

పెదపాడు: విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్స్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మధ్యాహ్న భోజనం పరిశీలించారు.

ఆదాయం పెంపునకు కృషి

బుట్టాయగూడెం: గిరిజనులకు ఉపాధి కల్పించడంతోపాటు ఆదాయ వనరులను పెంచడమే వన్‌దన్ వికాస్ కేంద్రాల లక్ష్యమని జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌ఛార్జి పీఓ పి.ధాత్రిరెడ్డి అన్నారు. మండలంలోని మారమూల గ్రామమైమ నాగంపాలెంలో ఏర్పాటు చేసిన వన్‌దన్ వికాస్ కేంద్రాన్ని జేసీ శనివారం సందర్శించి స్థానికులతో మాట్లాడారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు


నిడమర్రు: బువ్వనపల్లి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు


భీమడోలు: గుండుగొలనులో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


భీమడోలు: గుండుగొలనులో ముస్తాబైన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి


గణపవరం: సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గణపవరం: సుబ్రహ్మణ్య షష్ఠి పర్వదినాన్ని శనివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గణపవరంలోని ప్రసిద్ధ శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో శోభనాద్రి ఏర్పాట్లు పర్యవేక్షించారు. అగ్రహార గోపవరం, పిప్పర, కేశవరం, చిలకంపాడు, కాశిపాడు, మొయ్యేరు, గోపవరం, అర్ధవరం తదితర గ్రామాల్లో షష్ఠి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు.

దత్త బాలసుబ్రహ్మమణ్యస్వామికి పూజలు

ఉంగుటూరు : బాదంపూడి దత్తక్షేత్రంలో దత్త బాలసుబ్రహ్మమణ్య స్వామి ఆలయంలో షష్ఠి సందర్భంగా శనివారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ నిర్మాత కలవచర్ల శ్రీను ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా సుబ్బారాయుని షష్ఠి ఉత్సవాలు ప్రారంభం పోట

వైభవంగా షష్ఠి ఉత్సవాలు ప్రారంభం

భీమడోలు: మండల వ్యాప్తంగా సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం తెల్లవారుజాము నుంచి భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. స్వామి వారి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు చేసారు. గ్రామాల్లోని సహజ సిద్ధంగా ఉన్న పుట్టల వద్ద భక్తులు పూజలు చేశారు. గుండుగొలను, భీమడోలు, పోలసానిపల్లి, కురెళ్లగూడెం, పూళ్ల, సాయన్నపాలెంలో స్వయంభువుగా వెలసిన స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. గుండుగొలనులోని శ్రీవల్లి దేవసేన సేమత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి 63వ వార్షిక షష్ఠి మహోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. స్వామి వారికి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కురెళ్లగూడెంలోని పుట్ట వద్ద భక్తులు పూజలు చేసారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని సాయన్నపాలెంలోని సుబ్రహ్మణ్య స్వామికి భక్తులు పూజలు చేసారు.

కన్నుల పండువగా కల్యాణోత్సవం

నిడమర్రు: సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో శనివారం షష్ఠి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలపర్రులోని పంచాయతన క్షేత్రం, పత్తేపురం, ఎనికేపల్లి, బువ్వనపల్లి, పెదనిండ్రకొలనులో ఆలయాల వద్ద శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల వద్ద షష్ఠి తీర్థాలను ఏర్పాటు చేసారు. బువ్వనపల్లిలోని సుబ్బారాయుడి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రత్యేక పూజలను నిర్వహించారు.


భీమడోలు: కురెళ్లగూడెంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

చిన్నారులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


వెంగంపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్, అదనపు సీడీపీఓ రాజశేఖర్

పెదవేగి : చక్కటి ఆటపాటలతో చిన్నారులు ఆరోగ్యంగా ఎదిగేలా చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ మిషన్ సభ్యుడు డాక్టర్ జే రాజేంద్రప్రసాద్ అన్నారు. పెదవేగి మండలం ముండూరు పంచాయతీ వెంగంపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అదనపు సీడీపీఓ ఎంఎస్ రాజశేఖర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. పోషకాహార పంపిణీ తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లలకు ప్రభుత్వం ద్వారా అందుతున్న పోషకాహారాన్ని, అంగన్‌వాడీ కార్యకర్తల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పిల్లలతో కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ పార్వతి పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి బాలికల విద్య దోహదం


మాట్లాడుతున్న వృక్షశాస్త్ర అధ్యాపకురాలు పద్మావతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : బాలికల విద్య, ఆవశ్యకతపై అవగాహన కల్పించామని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం రాంబాబు తెలిపారు. గత నెల 25 నుంచి ఈనెల 23 వరకు నిర్వహిస్తున్న నేషనల్ జెండర్ క్యాంపెయిన్ చేతన 3.0లో భాగంగా బాలికల విద్య ఆవశ్యకతపై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర అధ్యాపకులు టీపీఎస్ పద్మావతి మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి బాలికల విద్య ఎంతగానో తోడ్పడుతుందని వివరించారు. వాణిజ్య శాస్త్ర విభాగ అధ్యాపకులు ఎస్ సుస్వలత, డి.సుజాత మాట్లాడుతూ ఒక స్త్రీ చదువుకుంటే ఆమె కుటుంబం మొత్తం విద్యావంతులవుతారని వివరించారు. రాజనీతి శాస్త్ర విభాగ అధ్యాపకుడు టి.వెంకట దుర్గాప్రసాద్ బాలికల విద్యకు సంబంధించిన చట్టాలను వివరించారు. బాలికల విద్యపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించామన్నారు. అనంతరం బాలికల విద్యను ప్రోత్సహించేందుకు, సమాజాన్ని చైతన్య పరిచేందుకు తనవంతు కృషి చేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

మత్తు పదార్థాలతో నాడీ వ్యవస్థకు నష్టం


ఎస్సై నాగకళ్యాణికి స్వాగతం పలుకుతున్న సెయింట్ థెరిస్సా స్కూల్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు ఎస్పీ కె.శివ కిషోర్ రూపొందించిన డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమంలో భాగంగా ఏలూరు 2 టౌన్ ఎస్సై వైవీ రమణ, మహిళా ఎస్సై నాగ కళ్యాణి శనివారం స్థానిక సెయింట్ థెరిసా బాలికల హై స్కూల్‌లో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో పాల్గొని మాదక ద్రవ్యాల విని యోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

ఉన్నత లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాలి

- ప్రభుత్వ పాఠశాలలోనే చదివా: కలెక్టర్ వెట్రిసెల్వి
- ప్రభుత్వ పాఠశాలల్లో వేడుకగా మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం


పెదపాడు: కలపర్రు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టరు కె వెట్రిసెల్వి, అధికారులు

పెదపాడు: విద్యాభ్యాసం సమయంలో ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని కలెక్టరు కె. వెట్రిసెల్వి అన్నారు. పెదపాడు మండలంలోని కలపర్రు, వట్లూరులోని పలు పాఠశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలపర్రు, ఎంపీపీ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాలను కలెక్టరు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించినట్టు తెలిపారు. విద్యార్థులు కృషి, పట్టుదలతో నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించడం ద్వారా ఉన్నత స్థాయిలో నిలుస్తారని చెప్పారు. పోటీల్లో విజేతలకు కలెక్టరు పతకాలు అందించారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, అధికారులతో కలిసి కలెక్టరు భోజనం చేసారు. ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, డీఈఓ వెంకటలక్ష్మమ్మ, ఎంఈఓలు నర్సింహమూర్తి, డీపీ రమణ, తహసీల్దార్ కృష్ణ జ్యోతి, వట్లూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి చూపాలి

దెందులూరు: చదువులో పోటీపడడంతో పాటు ఆటలపై కూడా ఆసక్తి చూపాలని కలెక్టర్ కె. వెట్రిసెల్వి పేర్కొన్నారు. దెందులూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. స్థానిక బాల సదన్‌లో పిల్లలను దత్తత తీసుకున్న కలెక్టర్ వారిని దగ్గర ఉండి పాఠశాలకు తీసుకుని వచ్చారు.

ఆశించిన స్థాయిలో హాజరుకాని తల్లిదండ్రులు

గణపవరం: మంచి ఫలితాల సాధనకోసం తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు సహకరించాలని పలువురు కోరారు. శనివారం మండల వ్యాప్తంగా పలుపాఠశాలల్లో మెగా తల్లిదండ్రులు, టీచర్ల సమావేశం నిర్వహించారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే సుబ్రహ్మణ్యషష్ఠి రోజున నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్ల సమావేశానికి ఆశించిన స్థాయిలో తల్లిదండ్రులు, స్థానికులు హాజరుకాలేదు.

తల్లిదండ్రులు శ్రద్ధ వహించండి

ఉంగుటూరు: విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధ వహించాలని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. శనివారం ఉంగుటూరు- 2 పాఠశాలలో మెగా పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. పాఠశాల-2లో నిర్వహించిన సమావేశంలో ఎంపీపీ పాల్గొనగా, నారాయణపురం పాఠశాలలో ఎంఈవో రవీంద్రభారతి, ఎంపీటీసీ ఛాంబర్ మండల అధ్యక్షుడు బండారు నాగరాజు పాల్గొన్నారు. తహసీల్దారు కైకరం హైస్కూల్లో, ఎంపీడీవో గంజిరాజ్ మనోజ్, ఉంగుటూరు జిల్లా పరిషత్తు హైస్కూల్లో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు.

బహుమతుల అందజేత

దెందులూరు: కొమరేపల్లి మండల ప్రాథమిక పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు విద్యార్థుల పేరెంట్స్ కమిటీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

హైస్కూల్ అభివృద్ధికి ఆర్థిక సాయం

దెందులూరు: కొవ్వలి ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో పూర్వ విద్యార్థి గారపాటి సీతారామాంజనేయ చౌదరి పాఠశాలలో అభివృద్ధి పనులకు రూ. 5 లక్షల విరాళాన్ని ప్రకటించారు.

విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందజేత

భీమడోలు: మండల వ్యాప్తంగా 42 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో మెగా తల్లిదండ్రులు ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాల, గుండుగొలను1, 2 ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించిన ఈ సమావేశానికి జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారిణి నాగరాణి హాజరై విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందజేశారు.

తల్లిదండ్రులకు మధ్యాహ్నం భోజనం

ఉంగుటూరు: బాదంపూడి హైస్కూల్లో మెగా పేరెంట్స్, టీచర్ల సమావేశం ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం వారందరికీ మధ్యాహ్నం భోజనాలు వడ్డించారు.

నిడమర్రు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు సహ పంక్తి భోజనాలు చేసారు.ఎంఈవో జి. బాలయ్య పాల్గొన్నారు.